బ్యాంకింగ్ వ్యవస్థలో తిరోగమన విధానాలు

- నిర్వీర్యం చేస్తున్న మోడీ సర్కారు
- సవాళ్లు ఎదుర్కొంటున్న ఉద్యోగులు
- ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు బ్యాంకుల జాతీయీకరణ దోహదం
- 30, 31 దేశవ్యాప్త సమ్మె వాయిదా
- ఎఐబిఇఎ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటాచలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే జాతీయ బ్యాంకులను కేంద్రంలోని మోడీ సర్కార్ నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళాభవన్‌లో శనివారం యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర 2వ వార్షిక మహాసభ ఘనంగా ప్రారంభమైంది. తొలుత ఎఐబిఇఎ పతాకాన్ని సిహెచ్.వెంకటాచలం ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల జాతీయాకరణ దేశంలోని సాధారణ పౌరులు సురక్షితమైన బ్యాంకింగ్ వ్యవస్థపై ఆధారపడటానికి సహాయపడిందన్నారు. అలాగే వ్యవసాయం, విద్య, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వంటి రంగాలకు బ్యాంకులు ప్రాధాన్యతారంగ రుణాలు అందించడంలో కూడా జాతీయాకరణ దోహదం చేసిందని తెలిపారు. అలాంటి బ్యాంకులను నేడు నిరంకుశంగా ప్రధాని మోడీ ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎఐబిఇఎ చరిత్రను వెనక్కి తిరిగి చూసుకుంటే గొప్ప గర్వం, స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ఈ సంఘంలో సాధారణ మధ్య తరగతి బ్యాంకు ఉద్యోగుల ప్రయాణం, వారి సంపూర్ణ ఐక్యత ద్వారా గౌరవం, భద్రత, మెరుగైన జీవన పరిస్థితులను పొందవచ్చునని తెలిపారు. ఆర్థిక సంస్థల్లో దివాలా, ఎన్‌పిఎల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రధాని మోడీ సామాన్య ప్రజల సంక్షేమాన్ని విస్మరించి.. కొంతమంది కార్పొరేట్ మిత్రుల సంక్షేమం కోసమే కట్టుబడి ఉన్నారని విమర్శించారు. తిరోగమన విధానాల వల్ల ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, అందులో ఉద్యోగ భద్రత ఒకటని తెలిపారు. బ్యాంకులు, బీమా, బొగ్గు గనుల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రభుత్వరంగ ఉద్యోగులు పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. జనవరి 31న యూనియన్లతో సమావేశం నిర్వహించేందుకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ అంగీకరించిందని, దాంతో 30, 31 తేదీల్లో దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెను వాయిదా వేసినట్టు తెలిపారు. ఐదు రోజుల బ్యాంకింగ్, పెన్షన్ అప్‌డేట్, అవశేష సమస్యలు, నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రద్దు చేయడం, వేతన సవరణ కోసం డిమాండ్ల చార్టర్‌పై ఐబీఏతో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ చర్చలు జరుపుతుందని వెల్లడించారు.

ప్రతినిధుల సభకు యూనియన్ ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్ స్వాగతం పలుకగా, అధ్యక్షులు టి.రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్ బి.ఎస్.ఆర్.మోహన్ రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. యూనియన్ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్రటెలి, ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, అఖిల భారత యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.శంకర్, చైర్మన్ విన్ సెంట్ డిసౌజా, ఎపి యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వి.ఉదయ కుమార్, యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్‌లు పి.సత్యం, సిఎస్. జనని తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంతో విద్యార్థులకు ఇబ్బందులు

- అధికారులు, అధ్యాపకులకు ఇంకా శిక్షణ ఇవ్వలేదు
- గ్లోబరీనాకు టెండర్ కట్టబెట్టేలా నిబంధనలు
- నవీన్ మిట్టల్‌ను నియంత్రించే శక్తి విద్యామంత్రికి లేదు
- సిఎం కెసిఆర్ జోక్యం చేసుకోవాలి
- ఇంటర్ విద్యా జెఎసి చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ విద్యలో ఆన్‌లైన్ మూల్యాంకనం ద్వారా జరిగే పరిణామాలు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి రాజీనామాకు దారితీసే కుట్ర జరుగుతున్నదని ఇంటర్ విద్యా జెఎసి చైర్మన్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జిజెఎల్ఎ) అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ వ్యవహారంపై మంత్రి ఉదాసీనత వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయనను నియంత్రించే శక్తి మంత్రికి లేదన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న జిజెఎల్ఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ విద్యలో దశలవారీగా ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడితే బాగుంటుందని చెప్పారు. కానీ ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఇచ్చిన టెండర్ నోటిఫికేషన్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే లాంగ్వేజ్ సబ్జెక్టులకు 20 లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యుమానిటీస్) సబ్జెక్టులకు పది లక్షలు, ఒకేషనల్ సబ్జెక్టులకు ఐదు లక్షలు కలిపి మొత్తం 35 లక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేపట్టాలంటూ ప్రకటించారని గుర్తు చేశారు. ఈ టెండర్ నోటిఫికేషన్ గురించి అధికారులకు అవగాహన లేదనీ, అధ్యాపకులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదని అన్నారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయని వివరించారు. మార్చి 15వ తేదీ నుంచి వార్షిక పరీక్షలను నిర్వహిస్తారని చెప్పారు. ప్రస్తుత వార్షిక పరీక్షల్లోనే 50 శాతం జవాబు పత్రాలను ఆన్‌లైన్ మూల్యాంకనం చేస్తే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందనీ, వారి భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకోవైపు గ్లోబరీనా సంస్థకు టెండర్ కట్టబెట్టేలా నిబంధనలను రూపొందించారని విమర్శించారు. గతంలో ఇంటర్ ఫలితాల్లో అవకతవకలకు కారణమైన ఆ సంస్థను ప్రభుత్వం, ఇంటర్ బోర్డు బ్లాక్‌లిస్టులో పెట్టలేదనీ, నిషేధించలేదని గుర్తు చేశారు. దీంతో ఇప్పుడు టెండర్‌కు దరఖాస్తు చేసే అర్హత ఆ సంస్థకు ఉందన్నారు. ఇందులోనూ సాంకేతిక విద్యాశాఖ అధికారి సూర్యప్రసాద్ జోక్యం ఉందన్నారు. గతంలో గ్లోబరీనాకు ఇంటర్ ఫలితాల ప్రాసెస్ చేసే టెండర్ ఖరారులో ఆయన పాత్ర కీలకంగా ఉందని గుర్తు చేశారు. దీంతో ఇంటర్ విద్య మళ్లీ సంక్షోభంలోకి వెళ్తుందన్నారు. ఇంటర్ బోర్డులో జరుగుతున్న తప్పిదాల గురించి మంత్రి సబితకు వివరించినా నవీన్ మిట్టల్‌పై చర్యలు తీసుకోవడం లేదనీ, ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. టెండర్ నోటిఫికేషన్‌పై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ నిబంధనలపై సాంకేతిక నిపుణులతో అధ్యయనం చేయించాలని కోరారు.

గ్రూప్-4కు భారీగా దరఖాస్తులు

- ఆన్‌లైన్‌లో సమర్పణకు రేపే చివరి తేదీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్ -4 పోస్టులకు భారీగా దరఖాస్తులొస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 7,41,159 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆన్‌లైన్‌లో గతనెల 30వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) కార్యదర్శి అనితా రామచంద్రన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈ నెల 30వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అవకాశముందని వివరించారు. 25 ప్రభుత్వ శాఖల పరిధిలో గతంలో 8,039 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం టిఎస్‌పిఎస్‌సి నోటిఫికేషన్‌ను గతనెల 30న జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జోతిబాపూలే వెనుకబడిన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల్లో 141 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేసిందని వివరించారు. దీంతో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల సంఖ్య గతంలో 289 ఉంటే ప్రస్తుతం 141 మంజూరు కావడంతో వాటి సంఖ్య 430కి పెరిగాయని తెలిపారు. ఇక గ్రూప్-4 పోస్టుల సంఖ్య 8,180కు పెరిగాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

హిమాయత్‌నగర్‌లో కుంగిన రోడ్డు

- గుంతలో ఇరుక్కుపోయిన టిప్పర్
- డ్రైవర్‌తోపాటు ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల హైదరాబాద్‌లోని గోషామహల్ చట్నీవాడి ఘటన మరవక ముందే నగరంలో మరోచోట రోడ్డు కుంగిపోయింది. హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 5లో గల ప్రధాన రోడ్డు శనివారం సాయంత్రం ఒక్కసారిగా కుంగిపోయింది. అదే సమయంలో మట్టి లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ గుంతలో ఇరుక్కుపోయింది. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్, ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నారాయణగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వారిని ఆస్పత్రికి తరలించారు. వెంటనే జిహెచ్ఎంసి అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు, జిహెచ్ఎంసి సిబ్బంది కలిసి క్రేన్ సాయంతో టిప్పర్‌ను బయటకు తీశారు. అటుగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. నాణ్యతలేని రోడ్ల నిర్మాణం వల్లే తరచూ నగరంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్యం

- ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకు వరంగల్ జిల్లాలో సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నట్టు ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. వరంగల్‌లోని సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను మంత్రి శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి నిర్మాణానికి నిధుల కొరత లేదని, 33 జిల్లాల్లో 33 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం కావాలనే రోజులు వచ్చాయని చెప్పారు. ఇటీవల 926 మంది డాక్టర్లను నియమించామని, త్వరలో మెడికల్ కాలేజీల్లో 1200 మంది ప్రొఫెసర్లను నియమిస్తామని తెలిపారు. 15 మెడికల్ కాలేజీలు ఉన్నాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 9 కొత్త కాలేజీలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఈ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిలో 35 రకాల సేవలతోపాటు అవయవ మార్పిడి సేవలు కూడా ఉంటాయని చెప్పారు. మెరుగైన వైద్య సేవల కోసం అధునాతన పరికరాలతో ఈ ఆస్పత్రికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. 2000 పడకల ఆస్పత్రి ఈ ఏడాది చివరి నాటికి భవన నిర్మాణం పూర్తవుతుందన్నారు. దసరా నాటికే పూర్తయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. 24 అంతస్తుల నిర్మాణంలో.. వరంగల్ హెల్త్ సిటీ చారిత్రాత్మక భవనం రాష్ట్రానికే కాదు దేశంలోనే అత్యుత్తమ వైద్య సేవలు ఇక్కడ అందబోతున్నాయని చెప్పారు. 216ఎకరాల్లో ఈ హెల్త్ సిటీ రూపుదిద్దుకుంటోందన్నారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కోసం ప్రభుత్వం ఖర్చు పెడుతుందని అన్నారు. వీరి కోసం ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిస్తీలు కట్టలేకపోతున్నాం..

- మంత్రి హరీశ్‌రావుకు సర్పంచ్‌ల మొర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నామని, ట్రాక్టర్ కిస్తీలు కట్టలేకపోతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు రాచర్ల నరేష్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు శనివారం హైదరాబాద్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో ట్రాక్టర్‌ల నెలవారీ కిస్తీలు కట్టలేకపోతున్నామన్నారు. చిన్న గ్రామ పంచాయతీలలో ట్రాక్టర్ లోన్లు ఇబ్బందికరంగా మారాయని, లోన్లు మాఫీ చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో పంచాయతీ నిధుల నుంచి నెలవారీ కిస్తీలు కట్టడం భారంగా మారిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, మందాపూర్ సర్పంచ్ బిక్షపతి, జంగంరెడ్డిపల్లి సర్పంచ్ కుమార్, అనంతసాగర్ సర్పంచ్ లావణ్య మల్లేశం, పలుగుగడ్డ సర్పంచ్ శ్రీపతి రాజేశ్వరి రవి తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో తేల్చుకుందాం

- పార్లమెంట్‌ను రద్దు చేసి.. ముందస్తుకు రండి
- అప్పులు చేయడంలో మోడీ నెంబర్ వన్ : కెటిఆర్
- చివరి బడ్జెట్‌లోనైనా నిధులు తెప్పించాలని బిజెపి నేతలకు హితవు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'బిజెపి నేతలకు దమ్ముంటే పార్లమెంటును రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు రండి.. తప్పకుండా అందరం కలిసే పోదాం.. ఎన్నికల్లో మీ సత్తా ఏంటో.. మా సత్తా ఏంటో నిరూపించుకుందాం' అని మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. నిజామాబాద్ నగరంలో శనివారం రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కెటిఆర్ పర్యటించారు. రూ.22 కోట్లతో కంఠేశ్వర్ కమాన్ వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. పాత కలెక్టరేట్ వద్ద రూ.50 కోట్లతో ఇందూరు కళాభారతి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో విలేకరులలో కెటిఆర్ మాట్లాడారు. గతంలో దేశం కోసం పని చేసిన 14 మంది ప్రధాన మంత్రులు మొత్తం కలిసి 2014 వరకు రూ.56 లక్షల కోట్ల అప్పులు చేస్తే, ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక్కరే ఎనిమిదేళ్ల పాలనలో రూ.100 లక్షల కోట్ల అప్పు చేశారని మంత్రి కెటిఆర్ తెలిపారు. ఈ అప్పుతో దేశంలోని ప్రతి పౌరునిపై రూ.1,25,000 అప్పు ఉంటుందన్నారు. రాష్ట్రంలో తాము చేసిన అప్పు భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. కేంద్రం మాదిరి కార్పొరేట్ దోస్తులకు పంచి పెట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని, విభజన చట్టంలోని ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ చివరిదని, రాష్ట్ర బిజెపి నేతలకు దమ్ముంటే ఈసారైనా అధిక నిధులు తీసుకొచ్చి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని హితవు పలికారు. పసుపు బోర్డు తీసుకొస్తానని హామీ ఇచ్చి, ఇక్కడ ఉన్న జూట్ బోర్డును ఎత్తేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా తెలంగాణపై కక్ష సదింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రం నుంచి వసూలు చేస్తున్న పన్నులను ఇతర రాష్ట్రాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని, తాము మాటల్లోకి దిగితే మీ తాత, తండ్రి గుర్తుకు వస్తారని అన్నారు. పెద్దాయన కొడుకువని ఊరుకుంటున్నామని, మీ తండ్రి (డిఎస్‌ను)ని గౌరవిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కెఆర్.సురేష్ రెడ్డి, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.

ముందస్తు అరెస్టులు

మంత్రి కెటిఆర్ పర్యటన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలని, ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీని నిర్మించాలని డిమాండ్ చేస్తూ మంత్రి పర్యటనను అడ్డుకుంటామని పిలుపునివ్వడంతో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేశ్‌తోపాటు పలువురిని అరెస్టు చేశారు. మంచిప్ప భూ నిర్వాసితులు ఆందోళన చేపట్టకుండా ఆ గ్రామంలో పోలీస్ పికెట్ నిర్వహించారు. ముంపు బాధితులెవరూ ఊరి దాటి వెళ్లకుండా బందోబస్తు చేపట్టారు. కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించిన కాంగ్రెస్, బిజెపి నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

9,10 తరగతులకు బోధించం

- 6, 7, 8 విద్యార్థులకే పాఠాలు చెప్తాం
- మంత్రి సబితకు పండిత, పిఇటి జెఎసి అల్టిమేటం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు బోధించేది లేదని పండిత, పిఇటి జెఎసి స్పష్టం చేసింది. జాబ్ చార్ట్ ప్రకారం ఆరు, ఏడు, ఎనిమిదో తరగతి విద్యార్థులకే పాఠాలు చెప్తామని వివరించింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేనను శనివారం హైదరాబాద్‌లో జెఎసి స్టీరింగ్ కమిటీ సభ్యులు సి జగదీశ్, ఎండి అబ్దుల్లా, చక్రవర్తుల శ్రీనివాసులు, నర్సిములు, క్రాంతికృష్ణ, గౌరీ శంకర్ కలిసి అల్టిమేటం జారీ చేశారు. పండితులు, పిఇటిల పదోన్నతులపై కోర్టులో ఉన్న అంశాన్ని త్వరగా తొలగించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమ కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరించారు. భాషా పండితులకు పదోన్నతులు ఇవ్వకపోతే ప్రపంచ తెలుగు మహాసభల సాక్షిగా ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన మాటకు విలువ లేకుండా పోతుందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన జిఓలను కాపాడుకుంటూ తమకు పదోన్నతులివ్వాలని కోరారు. మరింత చొరవ తీసుకుని ప్రభుత్వం తరఫున తగు చర్యలు తీసుకోవాలంటూ అధికారులను మంత్రి ఆదేశించారని వివరించారు. ఫిబ్రవరిలో ఉన్నత తరగతులకు బోధనను ఆపుతున్నందున రూ.150 అలవెన్సును బిల్ రూపంలో చేయొద్దని సూచించారు.

జిఎన్ఐటిఎస్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

హైదరాబాద్ : జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజీ అండ్ సైన్స్ (జిఎన్ఐటిఎస్) కళాశాలలో యువతీ యువకులలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడానికి ప్రత్యేక సెషన్‌ను నిర్వహించారు. దీనికి ఫిక్కీ వైఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ సోనాలి మోడి సరఫ్ సహా హెచ్‌డిఎఫ్‌సి రిటైల్ బ్యాంకింగ్ క్లస్టర్ హెడ్ మాధవి గోపాజి, జిఎన్ఐటిఎస్ ఐటి విభాగం హెడ్ రవి ప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెషన్‌లో.. ఆర్థిక ప్రణాళిక, నిర్వహణ యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకత, వినియోగం గురించి విద్యార్థులు అనేక విషయాలు తెలుసుకున్నారు. పొదుపు ఆవశ్యకతను అర్థం చేసుకోవడం, అధిక-రిస్క్, తక్కువ-రిస్క్ ఇన్వెస్ట్‌మెంట్‌లను అర్థం చేసుకోవడం, డిజిటల్ బ్యాంకింగ్, డిజిటల్ బ్యాంకింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలనే దానిపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే పెట్టుబడి, ఆర్థిక ప్రణాళిక యొక్క గరిష్ట ప్రాముఖ్యత, ప్రయోజనాలను వివరించారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్య గురించి నేర్చుకునే విజయవంతమైన సెషన్‌గా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

పిల్లల ప్రతిభాపాటవాలకు వేదిక తెలంగాణ బాలోత్సవం

- సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లల ప్రతిభాపాటవాలు.. సృజనాత్మకత శక్తికి గీటురాయి తెలంగాణ బాలోత్సవం అని బాలోత్సవ ఆహ్వాన సంఘం అధ్యక్షులు సుద్దాల అశోక్‌తేజ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం బాలోత్సవం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండ్రోజులు జరిగిన ఈ కార్యక్రమంలో 4 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. 22 అంశాలపై నిర్వహించిన పోటీల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నట్టు తెలిపారు. పిల్లల ప్రతిభాపాటవాలను మార్కులతోనో, మూస వార్షిక పరీక్షలతోనో కొలవలేమన్నారు. ఇలాంటి బాలోత్సవాలను పట్టణాల్లోనేకాదు ప్రతి గ్రామానికీ విస్తరింపజేయాలని సూచించారు. బాలోత్సవ గౌరవ అధ్యక్షులు సిహెచ్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. పిల్లల కోణం నుంచి ప్రపంచాన్ని చూస్తే కలిగే ఆనందం అనిర్వచనీయమన్నారు. అనుకూలమైన విద్యావిధానం రావాలని చెప్పారు. సైన్స్ ఎగ్జిబిషన్ చూసినప్పుడు పిల్లల ఆలోచనలు, ప్రతిభాపాటవాలు మనకు అందని స్థాయిలో ఉంటాయన్నారు. నేటి తరం విద్యార్థుల్లో అవకాశాలు ఇస్తే ఆకాశాన్ని తాకే శక్తి ఉందన్నారు. విశాలత్వం, సమ భావన, సృజనోత్సవం కలగలిపితే తెలంగాణ బాలోత్సవం అని తెలిపారు. తెలంగాణ బాలోత్సవం అనుభవంతో జిల్లా, మండల, గ్రామస్థాయిలో జరపాలని తీర్మానించారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర నాయకులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయకుమార్, బాలోత్సవం కార్యదర్శి ఎన్.సోమయ్య, ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి, అనుముల ప్రభాకర్, జలజ, మమత తదితరులు పాల్గొన్నారు.

భళారే బాలోత్సవ్..

రెండ్రోజుల బాలోత్సవం భళా అనిపించింది. ఎటు చూసినా పిల్లలే.. ఎటు పోయినా వేదికలే.. చిన్నారుల కళలు.. పసిగలాలు.. బుడిబుడి అడుగులు.. బంగారు బొమ్మలు కూచిపూడి నాట్య మయూరాలయ్యాయి. బాలోత్సవంతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం పులకరించిపోయింది. 52 పాఠశాలల నుంచి సుమారు 4000 మంది విద్యార్థులు హాజరు కాగా, 22 రకాల సృజనాత్మక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను 38 మంది న్యాయనిర్ణేతలు సమన్వయం చేశారు.

జ్యూట్ బోర్డు వద్ద కార్మికుల ధర్నా

- సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ జ్యూట్ కార్మికులు ధర్నాకు దిగారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని బోర్డు కార్యాలయం వద్ద బైఠాయించారు. హైదరాబాద్‌లోని నేషనల్ జ్యూట్ బోర్డును కోల్‌కతాలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయం కారణంగా తయారీదారులందరూ తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారంటూ టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి కేంద్ర జౌళిశాఖ మంత్రికి లేఖ రాశారు. ధర్నాకు ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, నాయకులు చరణ్ కౌశిక్, మెట్టు సాయి కుమార్ తదతరులు సంఘీభావం తెలిపారు.

టి జూడా నూతన అధ్యక్షునిగా డాక్టర్ కౌశిక్

- ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అఖిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజూడా) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఆ అసోసియేషన్ నాయకులు తెలిపారు. అధ్యక్షునిగా ఉస్మానియా మెడికల్ కాలేజీకి చెందిన డాక్టర్ కౌశిక్ కుమార్ పింజరాల, ప్రధాన కార్యదర్శిగా గాంధీ మెడికల్ కాలేజీకి చెందిన డాక్టర్ ఆర్.కె.అఖిల్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్లు డి.సాయినాథ్ (కాకతీయ మెడికల్ కాలేజీ), డాక్టర్ ప్రణయ్ మోతె (నిజామాబాద్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, డాక్టర్ అరుణ్ కుమార్ (ఆదిలాబాద్ రిమ్స్) తదితరులు ఎన్నికయ్యారు.

ఆ మూడింటికి బడ్జెట్‌లో నిధులు కేటాయించండి

- సిఎం కెసిఆర్‌కు ఉత్తమ్ బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంట రుణాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలకు రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈమేరకు శనివారం ఆయన సిఎం కెసిఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. పంట రుణాల కోసం రు. 20వేల కోట్లు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. నాలుగువేల కోట్లు, విద్యార్థులకు రూ. మూడువేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

IN THE HON'BLE COURT OF THE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD

O.S.No. 466 OF 2020

Between:
State Bank of India, RACPC-III, Hyderabad. ... Plaintiff
AND
Mr.Ranga Reddy Tatimakula and Another ... Defendants

To
1.Mr. Ranga Reddy Tatimakula S/o T.Sankar Reddy, # 15/557-1, Pandu Ranga Swamy Temple Street, Mydukur Road, Proddatur - 516360.
2. T. Sankar Reddy, Plot No. 706, 2nd Floor, Vivaknand Nagar Colony, Hyderabad - 500 072.

Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at **10.30 AM on 10.02.2023** in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the court.

Smt. Rapaka Aruna, Advocate, 11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar, Gaddiannaram, Hyderabad-500060.Cell: 9030617991

కవితతో సినీ నటుడు శరత్ కుమార్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆల్ ఇండియా సమతావ మక్కల్ కచ్చి అధ్యక్షులు, సినీ నటుడు శరత్‌కుమార్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. శనివారం హైదరాబాద్‌లో కవితను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. దేశ రాజకీయాలపై వారిరువురూ చర్చించారు. బిఆర్‌ఎస్ పార్టీ ఉద్దేశాలు, లక్ష్యాలు , ఎజెండా వంటి అంశాల గురించి శరత్ కుమార్ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు.

సింగరేణిలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ప్రారంభం

- పూర్తి దేశీయ టెక్నాలజీతో ఏర్పాటు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం జలాశయంలో నీటిపై తేలియాడే సోలార్ ప్లాంట్‌ను ఆ సంస్థ డైరెక్టర్ డి సత్యానారాయణరావు ప్రారంభించారు. ఐదు మెగావాట్ల ఈ ప్లాంట్ విద్యుదుత్పత్తిని టిఎస్ ట్రాన్స్‌కోకు అనుసంధానం చేశారు. దీనితో సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న సోలార్ విద్యుదుత్పత్తి సామర్థ్యం 224 మెగావాట్లకు చేరింది. ఈ ప్లాంట్ ప్రారంభంపై సంస్థ చైర్మన్ ఎన్.శ్రీధర్ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఇదే జలాశయంపై ఏర్పాటు చేసే మరో పది మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను వచ్చే మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సింగరేణి ఆధ్వర్యంలో రెండేండ్లలో మూడు దశల్లో 300 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. 219 మెగావాట్ల సామర్థ్యం గల ఎనిమిది ప్లాంట్లను మణుగూరు, కొత్తగూడెం, ఇల్లందు, రామగుండం-3, మందమర్రి ఏరియాల్లో నిర్మించి ప్రారంభించారు. ఈ ప్లాంట్లు అన్నీ సమర్థవంతంగా పనిచేస్తూ ఇప్పటి వరకు 540 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, కంపెనీకి దాదాపు రూ.300 కోట్లు ఆదా చేశాయని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో నిర్మించిన తొలి ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ఇదే. దీని డిజైన్‌ను దేశీయంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూపొందించింది.

61 ఏళ్ల వరకు కాంట్రాక్టు అధ్యాపకుల కొనసాగింపు

- ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరం (2022-23)లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పునరుద్ధరిస్తున్నట్టు ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. వారిని ప్రస్తుత విద్యా సంవత్సరంలో పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12న ఉత్తర్వులు విడుదల చేసిందని గుర్తు చేశారు. దీంతో కాంట్రాక్టు పద్ధతిలో 3,722 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. వారిలో 3,541 మంది కాంట్రాక్టు పద్ధతిలో, 103 మంది మినిమం టైం స్కేల్ లేదా పార్ట్‌టైం పద్ధతిలో, 78 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారని వివరించారు. వారిని 61 ఏండ్ల వరకు కొనసాగించొచ్చని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి వర్తిస్తుందని తెలిపారు. దీంతో 58 ఏండ్లు నిండిన కాంట్రాక్టు అధ్యాపకులు కొనసాగేందుకు అవకాశం లభించింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందిన వారు మళ్లీ విధుల్లో చేరేందుకు అవకాశమున్నది.

సిఎంకు కృతజ్ఞతలు

కాంట్రాక్టు అధ్యాపకులు 61 ఏండ్ల వరకు కొనసాగేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, మంత్రులు టి.హరీశ్‌రావు, పి.సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, తెలంగాణ రైతు బంధు సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్‌కు టిగ్లా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జంగయ్య, మాచర్ల రామకృష్ణగౌడ్, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం-475 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, కొప్పిశెట్టి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మమ్మల్ని పట్టించుకోని హాస్టల్ వార్డెన్ మాకొద్దు

- విద్యార్థుల రాస్తారోకో

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

"మమ్మల్ని పట్టించోని వార్డెన్ మాకొద్దు" అంటూ బిసి వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, అఖిల పక్షం ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బూర్గుపల్లిలోని బిసి వెల్ఫేర్ హాస్టల్‌లో మంచినీటి సౌకర్యంలేక కులాయి నీటినే తాగుతున్నామని, గదుల్లో ఫ్యాన్స్ లేకపోవడంతో దోమలు కుట్టి అనారోగ్యం పాలవుతున్నామని చెప్పారు. హాస్టల్ వర్కర్స్ సిగరెట్లు, మందు తాగి ఆవరణని అపరిశుభ్రం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దుప్పట్లు లేక చలికి గజగజ వణుకుతూ నిద్రిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను హాస్టల్‌కు వచ్చే వారికి చెబితే.. వార్డెన్ తమను మందలించడంతో పాటు కొడుతున్నాడని ఆరోపించారు.

సాగునీరు పుష్కలం... రాష్ట్రం సస్యశ్యామలం

- సమాచార శాఖ ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగునీటి రంగం అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు దేశానికే దిక్సూచిగా నిలిచాయి. 2014లో రాష్ట్ర అవతరణ తర్వాత సాగునీటి రంగానికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం సాహసోపేతమైన అనేక చర్యలు తీసుకుంది. ప్రభుత్వం సాగునీటి పారుదలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడంతో గత ఎనిమిదేండ్ల వ్యవధిలో రాష్ట్ర నీటి పారుదల రంగం అత్యున్నతస్థానానికి చేరింది. తెలంగాణ సస్యశ్యామలం కావాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిరకాల కోరిక నెరవేరడంలో ఎన్నో మైలురాళ్ళున్నాయి. నీటి ప్రాజెక్టుల రూపకల్పన, వాటిని నిర్ధేశించిన వ్యవధిలో పూర్తి చేసేందుకు పడిన తపన అంతా ఇంతా కాదు. రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర గణాంక 2022 నివేదిక ప్రకారం సాగునీటి విస్తీర్ణం 2014 సంవత్సరంలో కేవలం 62 లక్షల 48 వేల ఎకరాలకు ఉండగా, 2022 నాటికి సాగునీటి విస్తరణ 1 కోటి 35 లక్షల 60 వేల ఎకరాలకు పెరిగింది. 2014 రాష్ట్రంలోని సాగునీటి అత్యవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టుల రీడిజైనింగ్, రీ ఇంజినీరింగ్ వంటి వినూత్న ప్రణాళికతో కార్యక్షేత్రంలోకి దిగిన ప్రభుత్వం, విజయవంతంగా ఎన్నో ప్రాజెక్టులను చేపట్టింది. 24 ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో రాష్ట్రంలో 69.02 లక్షల ఎకరాల ఆయకట్టు కొనసాగుతున్నది. వాటి కింద రాష్ట్ర అవతరణ తర్వాత కొత్తగా 19.48 లక్షల ఎకరాలకు నీటిపారుదల సామర్థ్యం పెంచారు. 27 మధ్యతరహా ప్రాజెక్టుల పరిధిలో దాదాపు 3 లక్షల 4 వేల ఎకరాల అయకట్టుకు, చిన్న తరహా ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో మరో 5 లక్షల 53 వేల ఎకరాలకు, మరో 9 మధ్యతరహా, భారీ ప్రాజెక్టుల పరిధిలో 21 లక్షల 33 వేల ఎకరాలకు నీటి సరఫరా పెంచడం జరిగింది. కల్వకుర్తి , నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ , ఎల్లంపల్లి , మిడ్‌మానేరు , దేవాదుల, తదితర అన్ని ప్రాజెక్టులనూ పూర్తిచేసింది.

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు: ఈ ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టు. విభిన్న రీతిలో డిజైన్ చేసిన భారీ ప్రాజెక్టు ఇది. తెలంగాణలో సాగునీటికి ఇంతవరకు నోచుకోని భూములకు నీటిని అందించేందుకు ప్రభుత్వం నిర్మించిన బహుళ దశల ప్రాజెక్టు కాళేశ్వరం. ఈ ప్రాజెక్టులో భాగమైన అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. సాధారణంగా రిజర్వాయర్ల నిర్మాణం నదీ మార్గంలో జరుగుతోంది. కానీ, దీనికి భిన్నంగా నదీ, వాగు, ఏదీలేనిచోట అతిపెద్ద రిజర్వాయర్ మల్లన్నసాగర్ నిర్మాణం కావడం సాగునీటిరంగ చరిత్రలోనే ఒక అద్భుతం. అంతేకాకుండా గోదావరి నీటిని 90 మీటర్ల నుంచి 618 మీటర్లకు ఎత్తినీటిని తరలించే బృహత్తర కార్యాచరణ ఇందులో ప్రధానాంశం. అసాధ్యాన్ని సుసాధ్యం చేయటంలో తనకు తానే సాటి అని తెలంగాణ ప్రభుత్వం నిరూపించుకున్నది. గోదావరి నది పై మూడు బ్యారేజీలు, 20 మెగా నీటి లిఫ్టులు, 21 పంపుహౌజ్‌లు, 180 రిజర్వాయర్లతోపాటు 1832 కి.మీ పొడవునా సొరంగ మార్గాలు, పైపులైన్లు, కెనాళ్ల నిర్మించారు. మూడు సంవత్సరాల వ్యవధిలో అతి భారీ ప్రాజెక్టును పూర్తి చేసి రికార్డు సృష్టించింది.

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ : గోదావరి నీటిని తరలించి భద్రాద్రి - కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ చేపట్టింది. ప్రాజెక్టు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2014లో 68 లక్షల మెట్రిక్ టన్నులున్న వరి ధాన్యం ఉత్పత్తి 2022 నాటికి 2.49 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది. మిషన్ కాకతీయ పథకం కింద చెరువులు బాగు చేయడంతో చెరువుల కింద 25 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. భూగర్భజలాలు రాష్ట్ర వ్యాప్తంగా గణనీయంగా పెరిగి వ్యవసాయ సాగు కూడా రెట్టింపవుతున్నది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి) కూడా గణనీయంగా పెరుగుతున్నది.

నీటితీరువా పన్ను రద్దు : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావానికి ముందు రైతులు చెల్లిస్తున్న నీటితీరువా పన్ను బకాయిలను కెసిఆర్ సర్కారు ఏర్పడిన తర్వాత రద్దు చేసింది. అంతే కాకుండా శాశ్వతంగా నీటిపన్నును రద్దుచేసి, రైతులకు ఉచితంగా సాగునీటిని అందిస్తున్నది. ఈ మేరకు శనివారం రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రకటన విడుదల చేశారు.

దళితులపై దాడిని ఖండించండి

- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళితులపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని రోడ్డు భవనాల అతిథి గృహంలో శనివారం వామపక్ష రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు మండలం పిన్నించర్లలో దళితులపై జరిగిన దాడి గురించి బాధితులు వివరించారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పిన్నించర్ల గ్రామంలో రెండ్రోజుల కిందట దళితులపై దాడి చేశారని చెప్పారు. సంఘటనలు జరిగినప్పుడు బాధితులు పోలీస్ స్టేషనుకు వెళితే ఫిర్యాదులు తీసుకోవడం లేదన్నారు. కేసులు నమోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అవతలివైపు వారికే వత్తాసుగా ఉంటున్నారని ఆరోపించారు. దళితులపై పథకం ప్రకారం దాడి చేసినట్టు కనపడుతుందన్నారు. గ్రామంలో కాలువ నిర్మాణం విషయంలో చాలా మంది గుంపుగా వచ్చి దళితులపై దాడి చేశారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం తహసీల్దార్ సింధూజకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, మహమ్మద్, గోపి, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు అరుణ్‌కుమార్, ప్రసాద్, అడ్వకేట్లు ఎపి రాజేందర్, ఆర్ఆర్ మన్యం, సిపిఐ నాయకులు శ్యాంసుందర్, బిఎస్‌పి నాయకులు ప్రకాష్, దాసరి సంఘం నాయకులు కొండన్న, ఐఎఫ్‌టియు నాయకులు రవీందర్, దళిత సంఘ నాయకులు కత్తిపల్లి కురుమన్న, నరసింహ, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 18,570 దరఖాస్తులు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా 18,570 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని సమర్పించేందుకు సోమవారం వరకు గడువు ఉంది. ఒకే పాఠశాలలో ఎనిమిదేండ్ల సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులు, ఐదేండ్లు పూర్తి చేసిన ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) తప్పనిసరిగా బదిలీ కానున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో వారు సుమారు 25 వేల మంది వరకు ఉంటారని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బదిలీకి దరఖాస్తు చేసుకోవాలంటే కనీసం రెండేండ్ల సర్వీసు ఉండాలన్న నిబంధన ఉంది. వారు సుమారు 15 వేల మంది దరఖాస్తు చేసుకునే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. జీరో సర్వీసుతో బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలంటూ ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రస్తుత నిబంధనల ప్రకారం 40 వేల మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యే అవకాశమున్నట్టు విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

అమరుల ఆశయసాధన కోసం పునరంకితమవుదాం

- కొలిశెట్టి వజ్రమ్మ సంస్మరణ సభలో జూలకంటి రంగారెడ్డి

సంస్మరణ సభలో మాట్లాడుతున్న జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమరవీరుల ఆశయ సాధన కోసం పున్నరంకితం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు కొలిశెట్టి వజ్రమ్మ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. నాడు తెలంగాణ ప్రాంతంలో భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి పేద ప్రజల విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ విప్లవపోరాటంలో అనేకమంది అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కొలిశెట్టి వెంకయ్య ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. పోరాట కాలంలో అనేక ఇబ్బందులు వచ్చినప్పటికీ కడవరకు భర్త వెంకయ్యతో కలిసి వజ్రమ్మ పని చేశారని కొనియాడారు.

నాటి నుంచి నేటి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం కమ్యూనిస్టుగా వజ్రమ్మ జీవించారని చెప్పారు. కుమారుడు కొలిశెట్టి యాదగిరిరావును పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని, పూర్తికాలం కార్యకర్తగా పంపించారని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్మాయిల్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టుల త్యాగాల వల్ల నేడు మనమందరం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామని చెప్పారు. వారి త్యాగాలు వెలకట్టలేనివన్నారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్, డిటిఎఫ్ జిల్లా నాయకులు దశరథ రామారావు మాట్లాడుతూ.. ప్రజలకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పింది కమ్యూనిజం మాత్రమేనని చెప్పారు. అంతకుముందు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, చెరుకు ఏకలక్ష్మీ, కోటగోపి, చివ్వెంల మాజీ ఎంపిపి సభ్యులు కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ ఆఫీసు ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

గుడి ధ్వంసంపై ఆదివాసీల ఆగ్రహం

- ఫారెస్ట్ ఆఫీస్ ముట్టడి.. రాస్తారోకో
- పోలీస్ శాఖ జోక్యంతో శాంతించిన వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివాసీలు తరతరాలుగా కొలుస్తున్న సారలమ్మ దేవర గుడిని ధ్వంసం చేయడంపై ఫారెస్ట్ ఆఫీస్‌ను ముట్టడించారు. శుక్రవారం సాయంత్రం అటవీశాఖ అధికారులు గుడిని ధ్వంసం చేసిన విషయం విదితమే. దాంతో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, ఆదివాసీ ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆదివాసీలకు మద్దతుగా శనివారం భారీ ర్యాలీగా తరలివచ్చి అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడే రాస్తారోకో చేశారు. దీంతో తాడ్వాయిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పస్రా- ఏటూర్ నాగారం163వ జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచాయి. పస్రా సిఐ వంగ శ్రీనివాస్, స్థానిక ఎస్ఐ చవళ్ళ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ఆదివాసీలతో మాట్లాడారు. శాంతియుత మార్గంలో సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. దాంతో ఆందోళన విరమించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ మాట్లాడారు. సారలమ్మ గుడిని ధ్వంసం చేసిన అటవీ శాఖ అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగం ప్రకారం గుళ్ళు, మసీదులు, చర్చిలను మతాలకతీతంగా గౌరవించాలని, దానికి భంగం కలిగిస్తే నేరస్థులుగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. పీసా చట్టం అమలులో ఉన్న ప్రాంతమని, ఇక్కడ ప్రభుత్వ శాఖలు అన్ని పీసా గ్రామ సభలకు అనుగుణంగా పని చేయాలన్నారు. గుడిని ధ్వంసం చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయాలని, అప్పటి వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యమ నేత, సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్, మేడారం పుజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, ఉద్యోగుల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంకిడి బుచ్చయ్య, పునరుద్ధరణ కమిటీ మాజీ చైర్మెన్ కొర్నిబెల్లి శివయ్య, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, ప్రధాన కార్యదర్శి కొర్ని బెల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లో రేడియో

- ప్రారంభించిన టిఎస్ఆర్‌టిసి చైర్మన్ సజ్జనార్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

బస్సుల్లో ప్రయాణికుల వినోదం కోసం 'టిఎస్ఆర్‌టిసి రేడియో'ను ప్రవేశపెట్టారు. శనివారం ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ కూకట్‌పల్లి బస్ డిపోలో దీన్ని ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్టుగా 9 సిటీ ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉప్పల్-సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్-సికింద్రాబాద్, గచ్చిబౌలి-మెహిదిపట్నం, సికింద్రాబాద్-పటాన్‌చెరువు, కూకట్‌పల్లి-శంకర్‌పల్లి, కొండాపూర్-సికింద్రాబాద్, కోటి-పటాన్‌చెరువు, ఇబ్రహీంపట్నం-జెబిఎస్ మార్గాల్లో నడిచే బస్సుల్లో రేడియోలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. రేడియోలో పాటలతోపాటు ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యత, టిఎస్ఆర్‌టిసి అందిస్తున్న సేవలను ప్రయాణికులకు వివరిస్తూ కార్యక్రమాలను రూపొందించామన్నారు. అలాగే మానవ సంబంధాల ప్రాముఖ్యత, నైతిక విలువలు పెంపొందించే నీతి కథలను కూడా రేడియోలో ప్రసారం చేస్తారని చెప్పారు. ప్రయాణీకులు క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) పీవీ మునిశేఖర్, కూకట్‌పల్లి డిపో మేనేజర్ ఇషాక్ బిన్ మహ్మద్, మెకానికల్ సూపరింటెండెంట్ జయరాం, ఎలక్ట్రీషియన్ కేవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవధాన ప్రక్రియతో తెలుగు భాష సుసంపన్నం

- సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ

ప్రజాశక్తి కల్చరల్

వ్యాకరణంపై పట్టు, సందర్భోచితంగా పద ప్రయోగం, జ్ఞాపక శక్తి, అశువుగా చెప్పగల సద్యస్ఫూర్తి అన్నీ అవధాని ప్రతిభకు నిదర్శనాలని, మెడసాని మోహన్‌కు ఇవన్నీ వరాలని, ఆయన మేధ ఒక కంప్యూటర్ అనీ సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ కొనియాడారు. అవధాన ప్రక్రియతో తెలుగు భాష సుసంపన్నమైందని ఆయన పేర్కొన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై వంశీ ఇంటర్నేషన్, శుభోదయం గ్రూప్ సారథ్యంలో విఖ్యాత మహ సహస్రావధాని మెడసాని మోహన్‌కు కనకాభిషేకం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ రమణ పాల్గొని మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబం నుంచి స్వయం కృషితో సాహితీ రంగంలో అసాధారణ ఎత్తుకు ఎదిగిన మోహన్ పలువురుకి స్ఫూర్తి అని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అవధానం ప్రక్రియలో మార్పులు చేసి సామాన్య ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. పాఠశాలలో ఆంగ్ల భాష తప్పదని, కనీసం ఇంటిలో అయినా తెలుగునే మాట్లాడుతే భాష నిలిచి ఉంటుందని తెలిపారు. వంశీ సంస్థ సామాజికంగా, సాంస్కృతికంగా, ఎన్నో ఏళ్ళుగా సేవ చేస్తోందని అభినందించారు. ఆ సంస్థకు లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. రసమయి రాము అవధాన ప్రక్రియను అవధాని మోహన్‌ను పరిచయం చేశారు. వంశీ రామ రాజు స్వాగతం పలికారు. సాహితీవేత్త వోలేటి పర్వీశం అధ్యక్షత వహించగా, శుభోదయం లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు సభానంతరం మోహన్ అష్టావధానంలో తిరుమల శ్రీనివాసాచార్య అధ్యక్షత వహించి పచ్చుకులుగా పాల్గొన్నారు. డాక్టర్ అక్కిరాజు సుందర రామకష్ణ, కావూరి శ్రీనివాస్, డాక్టర్ సుమతీ నరేంద్ర, చిక్క రామదాసు, డాక్టర్ టి.గౌరీ శంకర్, రాధిక మంగినపూడి, ఆచార్య ఫణీంద్ర ఇతర అంశాల పృచ్ఛకులుగా పాల్గొన్నారు.

అదానీ అవకతవకలపై సెబి, ఇడి విచారణ జరపాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అదానీ సంస్థల షేర్ల అవకతవకలపై హిండెన్ బెర్గ్ ఇచ్చిన నివేదికపై సెబి, ఇడి వంటి సంస్థల ద్వారా విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేరం రుజువైతే తక్షణమే అదానీని అరెస్టు చేయాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. దేశ ప్రజల్లో ఈ అంశాలపై అనుమానాలు ఉన్నాయనీ, వాటిని నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రి ఒక ప్రకటన చేయాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ఈ అంశాలపై నైతిక బాధ్యత వహించి ప్రజలకు వాస్తవాలు తెలిసేలా దర్యాప్తు సంస్థలను ఆదేశించాలని పేర్కొన్నారు. ఈ నివేదిక వెలువడిన తర్వాత వరుసగా రెండు రోజులపాటు అదానీ సంస్థల షేర్లు, అందులో పెట్టుబడులు పెట్టిన ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసి, ఎస్‌బిఐ వంటి సంస్థల షేర్లు నాలుగు లక్షల కోట్ల రూపాయల భారీ పతనం కావడం ఆందోళన కలిగిస్తున్నదని వివరించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ సంపద అనూహ్య రీతిలో పెరిగి, ప్రపంచ కుబేరుల జాబితాలో మూడో స్థానానికి ఎగబాకారని గుర్తు చేశారు. ఇది దేశ చరిత్రలోనే కేంద్ర ప్రభుత్వ ఆశ్రిత పక్షపాతానికి నిదర్శనమని విమర్శించారు. అదానీ షేర్ల డొల్లతనం బయటపడి, రెండు రోజుల్లో స్టాక్ మార్కెట్ పతనంతో ఎల్ఐసీ రూ.18 వేల కోట్లు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెడితే ఏమవుతుందో ఈ ఉదంతం స్పష్టం చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను వాటి పద్ధతిలో నడవనీయాలనీ, బలవంతంగా షేర్లు కొనుగోలు చేసేలా చేయడం వల్ల ఇలాంటి ఆర్థిక సంక్షోభాలు తలెత్తుతాయని పేర్కొన్నారు.

ఫ్లోరోసిస్ ఉద్యమ నాయకుడు స్వామి మృతి

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం కెసిఆర్, కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడేనికి చెందిన ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి ఉద్యమ నాయకుడు అంశాల స్వామి(32) శనివారం ఉదయం మృతిచెందాడు. శుక్రవారం రాత్రి తన ట్రై సైకిల్ పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం మరణించారు. స్వామికి ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. తండ్రి సత్యనారాయణకు ఐదేండ్ల కిందట పక్షవాతం వచ్చింది. తల్లి వెంకటమ్మ 20 ఏండ్ల నుంచి నరాల వ్యాధితో బాధపడుతూ ఎటూ కదలలేని స్థితిలో ఉన్నారు. ఒక చెల్లి ఫ్లోరోసిస్‌తో బాధపడుతూ చనిపోయింది. మరో చెల్లి అనారోగ్యంతో మృతిచెందారు. ఫ్లోరైడ్ బారినపడిన అంశాల స్వామి ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. బాధితుడిగానే కాదు తనలాంటి సమస్యతో బాధపడుతున్న వారి తరపున గట్టిగా పోరాడారు. ఫ్లోరైడ్ రక్కసి పోరాటంలో భాగంగా జలసాధన సమితిని స్థాపించిన దుశ్చర్ల సత్యనారాయణ, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి కన్వీనర్ కంచుకట్ల సుభాష్ అప్పట్లోనే ఫ్లోరైడ్ బాధితులను ఢిల్లీకి తీసుకెళ్లారు. స్వయంగా నాటి ప్రధాని వాజ్‌పేయ్ టేబుల్‌పై ఐదేండ్ల వయస్సున్న అంశాల స్వామిని కూర్చోబెట్టి సమస్యను వివరించారు. వరుసగా ఢిల్లీలో ఐదుగురు ప్రధాన మంత్రులను కలిసి బాధితుల గోడును వివరించారు. గతేడాదే అంశాల స్వామి సొంత ఇంటి కల నెరవేరింది. మంత్రి కెటిఆర్ సాయంతో ఇంటిని పూర్తి చేశాడు. ఉపాధి కోసం హెయిర్ కటింగ్ షాపు ఏర్పాటు చేయించారు. గృహప్రవేశ కార్యక్రమానికి హాజరుకాని కేటీఆర్.. మునుగోడు ఉపఎన్నిక సందర్భంలో స్వామి ఇంటికి వెళ్లారు. స్వయంగా స్వామి యోగక్షేమాలు, ఇంటి నిర్మాణం గురించి ఆరా తీశారు. స్వామితో కలిసి మంత్రులు కెటిఆర్, జగదీశ్‌రెడ్డి భోజనం చేశారు. స్వామి కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా కల్పించిన సంగతి తెలిసిందే.

మానవీయ కోణాన్ని తట్టి లేపిన స్వామి : సిఎం కెసిఆర్

ఫ్లోరోసిస్ నిర్మూలన కోసం తన జీవిత కాలం పోరాడిన అంశాల స్వామి మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సామాజిక సమస్యగా మారిన ఫ్లోరోసిస్ సమస్యతోపాటు తక్షణమే గుర్తుకు వచ్చే పేరు అంశాల స్వామి అని సీఎం గుర్తుకు చేసుకున్నారు. మానవీయ కోణాన్ని తట్టి లేపుతూ తెలంగాణ ఉద్యమంలో అంశాల స్వామి చేసిన పోరాటం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. స్వరాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం ద్వారా, ఫ్లోరోసిస్ రహిత శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ధృఢ సంకల్పానికి, ఫ్లోరోసిస్ బాధితులైన అంశాల స్వామి వంటి వారే ప్రేరణగా నిలిచారని తెలిపారు. స్వామి మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. స్వామి మరణ వార్త విన్న మంత్రి కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ట్విటర్ వేదికగా కెటిఆర్ స్పందించారు. స్వామి ఎప్పుడూ తన హృదయానికి దగ్గరగా ఉంటాడని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ట్వీట్ చేశారు.

విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

- 31న మండల స్థాయిలో ధర్నా : ప్రజాపంథా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అడ్వాన్స్ కంజంప్షన్ డిపాజిట్ (ఎసిడి) పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలను మోపడాన్ని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఛార్జీల విధానాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈనెల 31న మండలస్థాయిలో విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు మరింత కష్టాల్లోకి కూరుకుపోయి విద్యుత్ వినియోగానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమం పేరు చెప్పి అడ్వాన్స్ పేరుతో వసూళ్లకు పూనుకోవడం దుర్మార్గమని విమర్శించారు.